www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 30 సెప్టెంబర్ 2025

రోజూ చెత్తను సేకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

చెత్త సేకరించే వాహనాలు రోజూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నార్త్ జోన్, 1వ డివిజన్ లోని వాటర్ గండి సందర్శించారు. అక్కడి ప్రజలను కలిసి, రోజు చెత్తను సేకరిస్తున్నారా లేదా, కాలువల్లో పూడికలు సకాలంలో తీస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువల తొలగించేందుకు శాశ్వతంగా ఒక కార్మికున్ని పెట్టాలని సంబంధిత అధికారిని ఆదేశించారు. అనంతరం 25వ డివిజన్‌ను సందర్శించారు. నీటి సరఫరా సమస్య రాకుండా చూసుకోవాలని అధికారులకి ఆదేశాలు ఇచ్చారు. పాత బస్టాండ్‌లో ఉన్న అన్నక్యాంటిన్‌ను సందర్శించి చుట్టూ పక్కల పరిసరాలు శుభ్రంగా ఉండేలాగా చూసుకోవాలని సూచించారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలకు బ్రేక్

- రూ.200 కోట్లు చెల్లింపులకు గ్రహణం
- 10 నుంచి ఐపి సేవలు నిలిపివేత
- రోగుల్లో ఆందోళన
- పట్టని కూటమి సర్కారు

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్యసేవలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం జిల్లాలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన సుమారు రూ.200 కోట్ల బకాయి చెల్లింపులు చేయడంలో చేసిన నిర్లక్ష్యమే రోగుల పాలిట శాపంగా మారింది. ఫలితంగా జిల్లాలోని ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ పరిధిలోని ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లిన వేలాది మంది ఔట్ పేషంట్ రోగులు అప్పులు చేసి డబ్బులు చెల్లించి వైద్యసేవలు చేయించుకో వాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వం తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి చెల్లింపులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఎన్‌టిఆర్ వైద్యసేవలకు గ్రహణం పట్టింది. జిల్లాలోని ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ పరిధిలో 106 ఆస్పత్రులు ఉన్నాయి. ప్రయివేటు 43, పిహెచ్‌సి 51, సిహెచ్‌సి 07, జిజిహెచ్‌లు 02, జిల్లా ఆస్పత్రి, సైక్రియాటిక్, ఏరియా ఆస్పత్రి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. వీటి పరిధిలో 4,87,035 మంది రోగులు ఎన్‌టిఆర్ వైద్యసేవ కార్డులతో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన బకాయిలను సకాలంలో చెల్లింపులు చేయక పోవడంతో ఎన్‌టిఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రలకు చెందిన రోగులు విలవిలలాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ఏడు రోజులుగా ఆగిన వైద్యసేవ

జిల్లాలోని ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ పరిధిలోని 43 ప్రయి వేటు ఆస్పత్రుల్లో వారం రోజులుగా ఔట్‌పేషంట్ సేవలు నిలిచిపో యాయి. ఈ నెల 25న ఎన్‌టిఆర్ వైద్య సేవల నెట్‌వర్క్ ఆస్పత్రుల రాష్ట్ర యూనియన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ స్పందించకపోవడం నిలిపివేతకు దారి తీసినట్లు తెలుస్తోంది. ఫలితంగా వేలాది మంది నిరుపేద రోగులకు వైద్యసేవలు అందని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా అప్పులు చేసి ఆరోగ్యసేవలు పొందాల్సిన దుస్థితి దాపురించింది.

10 నుంచి ఐపి సేవలు నిలిపివేత

అక్టోబర్ 10వ తేదీ నుంచి జిల్లాలోని ఎన్‌టిఆర్ వైద్య సేవల నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఇన్‌పేషంట్ సేవలు నిలిచిపోనున్నాయి. వారం రోజుల కిందట ఆగిన అవుట్‌పేషంట్ సేవలకుతోడు ఇన్‌పేషంట్ సేవలు అగితే పలువురి ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఫలితంగా జిల్లాలోని వేలాది మంది నిరుపేద, పేద, సామాన్య రోగులు లక్షలాది రూపాయలు అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురిం చింది.

రూ.200 కోట్లు చెల్లింపుల నిలుపుదలే!

జిల్లాలోని ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన సుమారు రూ.200 కోట్ల బకాయి చెల్లింపులే ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేలాది మంది రోగులకు ఆపరేషన్ తదితర ఖరీదైన వైద్యసేవలు కొనసాగించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎం తైనా ఉంది.

నాలుగింట్లోనే నిలిపివేత

జిల్లాలోని నాలుగు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే ఎన్‌టిఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వం బకాయి చెల్లింపులను క్రెడిట్ చేయడం మొదలుపెట్టింది. త్వరలో బకాయి సమస్య తీరిపోనుంది.

- వి.బాలాంజనేయులు, ఎన్‌టిఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్. కడప.

వంకలు, కాలువల కబ్జాలను అరికట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో కొంత మంది వంకలు, కాల్వలను కబ్జా చేస్తున్నారని, తక్షణమే అలాంటి వాటిని అరికట్టాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ నగరంలో అనేక ప్రాంతాల్లో వంకలను, కాలువలను ఆక్రమించి కబ్జా చేస్తున్నారని అన్నారు. గతంలో రామాంజనేయపురంలోని యానాది కాలనీ ప్రాంతంలో రెవెన్యూ అధికారులే కాలువ పక్కన ఉన్న ఇళ్లను కూల్చివేసి వంక వెడల్పు చేశారని పేర్కొన్నారు. అప్పుడు అనేక మంది పేదలు ఇళ్లు కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం అదే ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు ఆ వంక కాలువ ఉన్న ప్రాంతాన్ని ఆక్రమించి ఇతరులకు అమ్మకాలు పెట్టారన్నారు. ఫలితంగా అక్కడున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఎఫ్ క్వార్టర్స్ వద్ద ఉన్న కాలువను యథాతథంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. 40 సంవత్సరాలుగా పెదరాజుచెరువు నుంచి గురివిరెడ్డి కుంట వరకు ఉన్న నీళ్లన్నీ వంక, కాలువ ద్వారానే ప్రవహించే పరిస్థితి ఉండేదన్నారు. సమస్యను తక్షణమే పరిష్కారం చేయాలని అక్కడ ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. వంక పూడ్చడం వల్ల యానాది కాలనీలో నీళ్లన్నీ పేదల ఇండ్లలోకి వెళ్లే ప్రమాదముందని పేర్కొన్నారు. కాలువలు, వంకలు ఆక్రమించి నిర్మాణం చేపట్టడం ద్వారా భవిష్యత్తులో ఆ ప్రాంతమంతా నీట మునిగే పరిస్థితి వస్తుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితి రాకుండా ఇప్పటినుంచే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కావాలంటే, పైనుంచి వస్తున్న నీరు కిందికి వెళ్లాలంటే ఈ కాలువలో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అక్రమాలను తొలగించాలని డిమాండ్ చేశారు. తహాశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకుడు శివకుమార్ పాల్గొన్నారు.

తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్

మాట్లాడుతున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల దీర్ఘ కాలిక సమస్యలను వెంటనే పరిస్కరించాలని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీరాష్ట్ర అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు.ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ సమావేశాన్ని ఆర్‌టిపిపిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అనేకమార్లు ఎపిజెన్ కో యాజమాన్యం దృష్టికి తెచ్చామని అయినా స్పందన లేదన్నారు. సంబంధిత విద్యుత్ మంత్రికి తెలియజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంట్రాక్టు కార్మికులకు బోర్డు తరపున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక మరిచారని విమర్శించారు. 2022లో జరగాల్సిన వేతన సవరణ 16 మాసాలు ఆలస్యం చేశారని, అప్పటి నుంచి అరియర్స్ ఇవ్వలేదని పేర్కొన్నారు. వేతన సవరణ చేశాక ఉన్నత స్థాయి ఉద్యోగులకు విడతల వారీగా పిఆర్‌సి అరియర్స్ బకాయిలు చెల్లించాలన్నారు. తక్కువ వేతనాలు పొందుతున్న కాంట్రాక్టు కార్మికులకు అరియర్స్ ఇవ్వాలని కోరారు. అరియర్స్ వల్ల ఒక్కో కార్మికుడు సుమారు రూ. లక్ష నష్టపోతున్నారని తెలిపారు. ఎపిజెన్‌కో కాంట్రాక్టు కార్మికుల్లో అనేక మంది 15 నుండి 20 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. వారికి అనుభవం విద్యార్హతను బట్టి ఉదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో హరి ఓబులరెడ్డి, శేఖర్, వెంకట స్వామి , కొండారెడ్డి, అబ్దుల్ హమీద్, గంగయ్య, నాగేంద్ర, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

జెఎసి ఆధ్వర్యంలో సమ్మె కార్యాచరణ

ఆర్‌టిపిపిలో ప్రాంతీయ జెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొన్ని రోజులుగా సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. ఎపి ఎస్‌పిఇ కేంద్ర జెఎసి పిలుపుమేరకు సమ్మె కార్యాచరణ నోటీసును సోమవారం ఆర్‌టిపిపిలో సిఇ వాసుదేవరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించని పక్షంలో సెంట్రల్ జెఎసి కమిటీ ప్రణాళిక పిలుపుమేరకు సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. సమ్మె నోటీసులో ఆందోళన కార్యక్రమాల వివరాలు పొందుపరిచారు. అక్టోబర్ 6న విశాఖపట్నం ఈపిడీసీఎల్ ఆఫీస్ వద్ద ధర్నా, 8న తిరుపతి ఎస్పీడీసీఎల్ ఆఫీసు వద్ద, 13న చలో విజయవాడ కార్యక్రమం, 14న వర్క్ టు రూల్, 15వ తేదీ నుండి అనిశ్చిత సమ్మె కొనసాగించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు జగదీష్, రామలింగారెడ్డి, శివయ్య పాల్గొన్నారు.

హిందీభాషకు గౌరవం ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జాతీయ గీతాన్ని, జాతీయ పతాకాన్ని గౌరవించినట్లుగానే మనమంతా అధికార భాష హిందీని ఆదరించి మన సంస్థల కార్యకలాపాల్లో వినియోగించాలని ప్రముఖ హిందీ ఉపాధ్యాయుడు, ప్రచారకుడు కె.ఎస్.ఫర్వతుల్లా పిలుపునిచ్చారు. సోమవారం ఎల్ఐసి ఆధ్వర్యంలో హిందీ పక్షోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధనలో హిందీ విశేషమైన పాత్ర పోషించిందన్నారు. హిందీకి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడంలో మహాత్మా గాంధీ పాత్ర ప్రముఖమైందని అన్నారు. ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ జి.కె.ఆర్.వి.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో హిందీ అమలు రాజ్యాంగబద్ధ విధి అని, దానిని తాము త్రికరణ శుద్ధిగా పాటిస్తున్నామని అన్నారు. హిందీ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన హిందీ గీతాలాపన, అనువాదం, హిందీ పద ధారణ పోటీలలో విజేతలకు సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామ సుందర రావు, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్, ఇతర మేనేజర్లు, అధికారులు సత్య ప్రసాద్, లక్ష్మీనారాయణ, రమేష్ బాబు, హరీంద్ర, బాబు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం పెట్టాలి

- కెజిబివి డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కెజిబివిలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టడం చాలా అవసరమని కెజిబివి డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు అన్నారు. సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిసి నిత్యానంద రాజులు మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నుంచి కెజిబివిల సిబ్బంది జాగ్రత్తగా తమ విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. శుభ్రత, నాణ్యత ఎంతోముఖ్యమన్నారు. కడప జిల్లాలోని కెజిబివిలల్లో పని చేస్తున్న వంట మనుషులకు, వాచ్ ఉమెన్‌లకు, ఎఎన్ఎంలకు, అటెండర్లకు, స్వీపర్లకు, కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్చర్లక, జిసిడిఒ దార్ల రూత్ ఆరోగ్య మేరి, కెజిబివి సిబ్బంది విధి విధానాలు, బాధ్యతలు, విధులు వివరించారు. చేతులు కడుక్కోవడంలోని మెలకువలను ఉపాధ్యాయులు దేవదత్తం డెమో చేసి వివరించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు సంజీవరెడ్డి, ఆఫీసు సిబ్బంది అనూష, మాధవి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - కలసపాడు

మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఎపి రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ సాధికారపు రంతు, ఎంపిపి నిర్మలదేవి, సర్పంచ్ శివలీల పేర్కొన్నారు సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య సిబ్బంది ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అతిథులతోపాటు ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయల సీమ గ్రామీణ బ్యాంకు మేనేజర్ మరియూ ఆధ్వర్యంలో ముగ్గురు క్షయ వ్యాధి గ్రస్తులకు పోషకాహారం అందజేశారు. గుర్బిణులకు పౌష్టికాహారం, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరించారు. అలాగే ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. అనంతరం రోగ్లుకు షుగర్, బిపి, కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమానికి 278 మంది ప్రజలు హాజరయ్యారని వైద్యులు చెప్పారు. పోరుమామిళ్ళ సబ్ యూనిట్ ఆఫీసర్ టి.నరసింహారెడ్డి ప్రజలకు మలేరియా, ఫైలేరియా,డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు లాంటి జ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.ఎ. రవి నరసింహం , ప్రసూతి వైద్యులు డాక్టర్ అఖిల, కంటి వైద్య నిపుణులు శ్రీకృష్ణ దేవరాయలు, చిన్న పిల్లల వైద్యనిపుణులు. మౌనిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకట సుబ్బమ్మ హెల్త్ ఎడ్యుకేషనల్ అధికారి ఖాదర్ బాషా, సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, స్టాస్ నర్సస్, అరుణ, మాధవి, మల్లేశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్, స్వాతి, ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశవ్యాప్తంగా భారత రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కొనసాగుతూ ఉందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా ప్రధానిగా మోదీ కొనసాగుతున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే నల్లధనం బయటకు తీస్తామన్న మోదీ ఇప్పటికి ఒక్క రూపాయి తీసుకురాలేదని పేర్కొన్నారు. మోదీ ఇచ్చిన వాగ్దానాల అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామన్న మోదీ ఇంతవరకు ఒక్క పైసా కూడా వేయలేదనిచెప్పారు. ఉద్యోగాలు రాక పట్టభద్రులు పారిశుధ్య కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రాష్ట్రానికి ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. తన సొంత నియోజకవర్గానికి ఏమి చేయలేదని ఆరోపించారు. చంద్రబాబుపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఏర్పడిందని పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం పూర్తిగా తప్పు అన్నారు. పెండింగ్‌లో ఉన్న 15 మెడికల్ కళాశాలల నిర్మాణాలు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని తెలిపారు. అమరావతికి ఉన్న నిధులు మెడికల్ కళాశాలల నిర్మాణానికి లేవా అని ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే నిధులు మంజూరు

ప్రజాశక్తి - కడప : రవీంద్ర నగర్ వాసుల ఇబ్బందులు గుర్తించి వంతెనల నిర్మాణానికి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి హయాంలోని నిధులు మంజూరు చేశారని కార్పొరేటర్లు సుబ్బరాయుడు, అజ్మతుల్లా, ఐస్ క్రీమ్ రవి, మహమ్మద్ షఫీ, శ్రీరంజన్ రెడ్డి, జిలాన్ అన్నారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుగ్గవంక వరద నీటి ఉధృతికి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు అన్నారు. బుగ్గ వంక రక్షణ గోడ, అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. 2023 వంతెనల నిర్మాణానికి రూ. 20 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు.పనులు ప్రారంభించేలోపే కాంట్రాక్టర్ తండ్రి చనిపోవడంతో చేపట్టలేదని, ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయ్యాయని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు వైసిపి హయాంలోనే నిధులు మంజూరు చేస్తే అదే జిఒను మార్పు చేసి తామే చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటు అన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

క్రీడాకారుడిని అభినందిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్ షిప్ అందుకున్న శ్రీనివాస్ జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని నాయ కులు మాలే శివ, కమ లాపురం నియోజకవర్గ నేత వేణుగోపాల్ రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం రాష్ట్ర స్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథిలిటిక్స్ ఛాంపియన్ శ్రీనివాస్‌ను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి.కె.దిన్నె మండలం నాగిరెడ్డి పల్లెకు చెందిన కనకవరప్రసాద్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీనివాస్ 10వ తరగతి చదువుతున్నాడని, 80మీటర్ల హర్డెల్స్‌లో 2స్థానం దక్కించుకోవడం గర్వకారణమని కొనియాడారు. క్రీడాకారులను ప్రోత్సాహిస్తే జాతీయ స్థాయిలో కూడా రాణించగలరని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఒరిస్సాలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో ఎపితరపున శ్రీనివాస్ పాల్గొననున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా స్కూల్స్ స్థాయిలో క్రీడల్లో ఉత్సాహన్ని కనబరిచే వారిని ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రీడల పట్ల యువకులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

రాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాజ్యాంగం పట్ల మాలలు అవగాహన పెంచుకోవాలని తిరుపతి మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుఃలు తుల్లి బిల్లి అశోక్ బాబు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా ఆగస్టు 26న రాయల సీమ వ్యాప్తం గా పర్యటిస్తున్న అశోక్ బాబు సోమవారం కడపకు చేరుకున్నారు. ఆయనకు కడపలో ఘనస్వాగతం లభించింది. మాజీ ఎంపి చింతా మోహన్ తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా స్టేట్ గెస్ట్ హౌస్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు తమ సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. మాల మాదిగలు ఒకటే అన్న భావనతో ఇన్నేళ్ళు మాలలు ఓపిక పట్టారని పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు ఇద్దరి మధ్య విభేదాలు సృష్టించి విడగొట్టి తమ పబ్బం గడుపు కుంటున్నాయని మండిపడ్డారు. సామాజికంగా అభివృద్ధి చెందేందుకు చర్యలు చేపట్ట కుండా వర్గీకరణ విషయంలో ఇద్దరి మధ్య అగాధం సృష్టించారని విమర్శించారు.

పెండింగ్ అరియర్స్ చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులుగా పనిచేస్తూ రిటైర్డ్ అయిన వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2, 4 నెలల నుంచి జీతాలు అందలేదని పేర్కొన్నారు. ఆరోగ్యం బాగా లేని ఆప్కాస్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమ్మె ఇచ్చిన జిఒ నంబర్ 124 ప్రకారం గత నెలలో పెరిగిన వేతనం, పెండింగ్‌లో ఉన్న అరియర్ బిల్లును త్వరగా సిద్ధం చేయాలని తెలిపారు. స్టాండింగ్ కమిటీలో పెట్టి కార్మికులకు వేతనాలు వారి అకౌంట్‌లోవెయ్యాలని చెప్పారు. కొత్తగా అడిషనల్ వర్కర్లను తీసుకోవాలని కోరారు. సమస్యలపై స్పందించిన కమిషనర్ మనోజ్ రెడ్డి హామీలను అమలు చేస్తామని పేర్కొన్నారు.

ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : దసరా పండుగ సీజన్‌ను ఆసరాగా చేసుకుని ప్రజల వద్ద నుంచి అధిక టికెట్ రేట్లు పెంచి వసూలు చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దసరా సీజన్లో ప్రజలు ట్రావెల్స్ బస్సులు ఎక్కాలంటే భయపడుతున్నారున్నారు. పండుగ పేరుతో ప్రజలను అధిక టికెట్ రేట్లతో నిలువు దోపిడి చేస్తున్నారన్నారు. జిల్లాలోని ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు సాధారణ రోజులలో ఒక ధర, పండుగ సీజన్‌లలో ఒక ధరను పెట్టి ధరలను అమాంతంగా పెంచి ప్రజల డబ్బులు దోచుకుంటున్నారని విమర్శించారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేద మహిళలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కాశినాయన : మండల పరిధిలోని వరికుంట్ల యానాది కాలనీ మహిళలందరికీ సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జనావాసాలకు, నాగరికతకు దూరంగా అడవులకు, పర్వతాలకు దగ్గరగా నివసిస్తూ కనీస అవసరాలకు కూడా నోచుకోలేని కాలనీలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వారు కలవలేకపోతున్న మిగిలిన సమాజానికి దగ్గరగా చేర్చేలా వారిలో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలను బడికి పంపించి చదువుకునే సమాజంలో తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, చదివితే ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయని వారికి తెలిపారు.

ఓబులాపురం-వరికుంట్ల రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-కాశినాయన

పనులు చేపడుతున్న సిబ్బంది

మండలంలోని ఓబులాపురం-వరికుంట్ల రోడ్డుకు మరమ్మతు పనులు సోమవారం సంబంధికారులు చేపట్టారు. డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి ఫిర్యాదు మేరకు జెసి అతిథి సింగ్ వెంటనే స్పందించి మరమ్మతు పనులను ప్రారంభింపజేశారు. ఈనెల 24న మండలంలోని నరసాపురం లో ఓటు చోరీ కార్యక్రమానికి విచ్చేసిన డిసిసి అధ్యక్షులు విజయజ్యోతికి దృష్టికి గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకపలతోపాటు కొందరు పాత్రికేయులు రోడ్డు దుస్థితిపై తీసుకెళ్లారు. ఆమె వెంటనే స్పందించి కలెక్టర్‌కు వినతి పత్రం ద్వారా విన్నవించారు. పైగా కడపలోని జెసికి కూడాఫిర్యాదు చేశారు. జెసి వెంటనే స్పందించి ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించడంతో పనులు ప్రారంభించారు. దీంతో ప్రజలు జెసికి, డిసిసి అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నాయకులు

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని నాగరాజ్ పేట సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్క్రీమ్ రవి కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్‌ను కార్పొరేటర్లతో కలిసి సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్ క్రీమ్ రవి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నేతలు, కార్యకర్తలపై దొంగ కేసులు అక్రమ కేసులు బనాయించి జైలు పాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందుకే కార్యకర్తలకు, అభిమానులకు అండగా ఉండాలని భావించి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ప్రారంభించామని చెప్పారు. వైసిపి సానుభూతిపరులతో పాటు ఇబ్బందులకు గురయ్యే ప్రతి ఒక్కరూ డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి నమోదు చేసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామ్ లక్ష్మణ్ రెడ్డి, కె.బాబు, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, రామకృష్ణారెడ్డి, రామచంద్రయ్య, అజ్మతుల్లా, బసవరాజు పాల్గొన్నారు.

సంతకాల సేకరణకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప : 'ఓట్ చోర్ - గద్ది ఛోడో' కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరం 7 రోడ్ల సర్కిల్లో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఓట్ల అక్రమాలపై ఎన్నికల కమిషన్, అధికార బిజెపి కుమ్మక్కై ఓట్లు ఏ విధంగా దొంగలించాంని పేర్కొన్నారు.బతికి ఉన్న వారి ఓట్లను తొలగించడం ఒకే గది ఉన్న ఇంటిలో 80 ఓట్లు ఉండడం, డోర్ నెంబర్ లేని ఇంటికి ఓట్లు కలిగి ఉండడం, ఇలా రకరకాలుగా మహదేవ్ పుర నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్లు ఓట్లు ఉన్నట్లు చేశారన్నారు. ఈ విషయాన్ని రాహుల్‌గాంధీ బట్టబయలు చేశారని పేర్కొన్నారు. సంతకాలు సేకరించి రాష్ట్రపతికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఐసిసి కో-ఆర్డినేటర్ ఎస్ఎ సత్తార్, కోటపాటి లక్ష్మయ్య, నాసిర్ హుస్సేన్, నాసిర్ ఖాన్, బిసి సెల్ నాయకులు పాల్గొన్నారు.

డిఎస్‌సికి ముందే బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మెగా డిఎస్‌సికి ముందే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల అంతరజిల్లా బదిలీలు చేపట్టాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్‌జెయుపి భుజంగరావు స్మారక టీచర్స భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి ముత్తోజు వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్. యం. షరీఫ్, కడప జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు, టీచర్స్ హెూం ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని బెదిరించడం తగదు

ప్రజాశక్తి - కడప : బిజెపి, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై భారత దేశ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తూ ఓట్ల దొంగతనానికి పాల్పడుతున్న రహస్యాన్ని ఛేదించిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అంతమొందిస్తామని ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రింట్ మహదేవ్ బెదిరించడం తగదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. కడపలోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం భారత రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడిన రాహుల్ గాంధీని చంపుతామన్న హెచ్చరిక భారతీయ జనతా పార్టీ హత్యా రాజకీయాలకు పరాకాష్టగా తెలిపారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడరన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో 52 మంది లబ్ధిదారులకు రూ.39.26లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య చికిత్స చేసుకోవడానికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యలు త్వరిగతిన పరిష్కరిస్తూ, ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందుతన్నాయన్నారు. వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మద్దతు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రమణారెడ్డి, సుబ్బారెడ్డి, జయచంద్రారెడ్డి సుబ్బారెడ్డి, రమణరెడ్డి, గంగిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, తాళపల్లి వేంకటేశ్వరరెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేష్, నరసింహరెడ్డి, మల్లెల శ్రీను, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సాయపడాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆపద సమయంలో ప్రతి ఒక్కరికీ సాయపడాలని మానవత సేవా సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఆర్ఇఎస్ఎస్‌వి జూనియర్ కళాశాలలో సోమవారం మానవత సేవా సంస్థ మండల నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించాఆరు. చైర్మన్‌గా రాజుల బాలీశ్వర్‌రెడ్డి, కో–చైర్మన్‌గా కొరివి కృష్ణమూర్తి, కన్వీనర్‌గా గంగవరం ఆది నారాయణరెడ్డి, డైరెక్టర్‌గా ఇవి మహేశ్వరరెడ్డి, అధ్యక్షులుగా రెడ్యం సుబ్బారెడ్డి, ట్రెజరర్‌గా దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, సెక్రటరీగా మునగాని శ్రీనివాసులు, జాయింట్ సెక్రెటరీగా సుబ్బు ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇవి మహేశ్వర్‌రెడ్డి సంస్థకు బాడీ ఫ్రీజర్‌ను ఉచితంగా అందజేయనున్నట్లు ప్రకటిం చారు. పూసల కొట్టాలకు చెందిన కృష్ణమూర్తి రూ.25వేలు సంస్థకు విరాళంగా అందజేశారు.

ఖాజీపేటవాసికి కీర్తిరత్న పురస్కారం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట పట్టణానికి చెందిన ప్రముఖ చరిత్రకారులు షేక్ ఇంతియాజుద్దీన్‌కు జాతీయస్థాయిలో కీర్తిరత్న పురస్కారం లభించింది. సమాజ సేవయే పరమావధిగా కృషి చేస్తున్నందుకుగానూ తనకు ఈ పురస్కారం లభించినట్లు షేక్ ఇంతియాజుద్దీన్ తెలిపారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భవాని సాహిత్య వేదిక కరీంనగర్ చౌడూరు కళా పీఠం హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో పుస్తక ఆవిష్కరణ సభ, కవి సమ్మేళన కార్యక్రమం రవీంద్ర భారతిలో నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా తాను కార్యక్రమంలో సాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నానన్నారు. తాను త్యాగమూర్తులకు జైజై, భారత్ మహాన్ పుస్తకాలను రచించినట్లు చెప్పారు .

బ్రాహ్మణులకు స్థానం కల్పించడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

దేవస్థానం పాలక మండలిలో బ్రాహ్మణులకు కూడా స్థానం కల్పించడం హర్షణీయమని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నార. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలకు ముందు దేవస్థానం పాలకమండలిలో బ్రాహ్మణులకు కూడా చోటు కల్పిస్తామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ మేరకు వేంపల్లెలోని వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలిలో వెలవలి మారుతి ప్రసన్నకు సభ్యులుగా నియమించారన్నారు. ఇటీవల రాష్ట్రంలోని అన్ని దేవస్థానం పాలకమండలిల్లో బ్రహ్మణ కేటగిరీని సభ్యులుగా నియమించడం శుభపరిణామమన్నారు. గతంలో ఆలయ అర్చకుడు ఒక్కడు మాత్రమే ఎక్స్ ఆఫిసియో సభ్యుడు ఉండేవారని చెప్పారు. ప్రస్తుతం ఆలయ అర్చకుడితోపాటు మరోకరికి అవకాశం కల్పిం చారన్నారు. విద్యుత్ చార్జీల్లో 13 పైసలు తగ్గిస్తామని చెప్పడంతో బడుగు బలహీన ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఎన్నికల హామీలను నేరవేర్చడం సంతోషకరమని ప్రసాదరావు తెలిపారు.

ఏసు కరుణాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యాయామ ఉపాధ్యాయులు లింగందిన్నె వరదారెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన కుమారుడు డిప్యూటీ తహశీల్దార్ వరదకిషోర్ రెడ్డి మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం అనాధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు 2వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

E.P.No. 158/2021 in A.C.No. 161/2019

Between:
M/s శ్రీరాం ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, జి.పి.ఏ. ఎమ్.రామ పెంచలయ్య, ఆఫీస్ అట్ వేంపల్లె రోడ్డు, యర్రగుంట్ల టౌన్, కడప జిల్లా. **...వాది/డి.హెచ్ఆర్.**

Vs

లహరి అలంకారం మరియు ఇతరులు. **...ప్రతివాది/జె.డిఆర్.**

To,
Alankaram Satyanarayana Raju- J.Dr2
S/o A.Suryanarayana Raju, R/o D.No.169, NGO Colony, Raja Kenals, Proddatur Town, Now Residing at D.No.30/347-126, MSR Hill Valley, Near Chalamareddy Village, Bukkarayapalle Post, Kadapa City and District.

నోటీసు

పై నెంబరు వాది 2వ ప్రతివాది/జె.డిఆర్. అయిన నీ పైన వాది/డి.హెచ్ఆర్ కంపెనీ వారు E.P. మొత్తం రాబట్టు కొనుటకు క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తిని వేలం కోరి వున్నారు. అట్టి E.P. యందు నీకు ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టు యందు 15.10.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెను. లేనంతట పరోక్షంగా తీర్మాణించబడును.

షెడ్యూలు

కడప డి॥ప్రొద్దుటూరు రి॥డి॥ ప్రొద్దుటూరు సబ్॥డి॥ ప్రొద్దుటూరు మండలం, కొత్తపల్లె పంచాయితి, వార్డు నెం.3 కలిగి ఎసియం క్వార్టర్స్ ఏరియాలో చేరిన కొత్తపల్లె గ్రామం పొలంలోని ప్లాటు నెం.5 గల జాగాకు నెంబరు వారి వివరం. సర్వే నెం.254/2పైకి య.0.03 1/2 సెంట్లు లేక 0.014 హెక్టార్లు గల జాగాకు దిశలు
తూర్పు: ప్లాటు నెం.6 గల జాగా, పడమర: ప్లాటు నెం.4 గల జాగా, ఉత్తరం: ఐడీ నెంబరులోని భూమి, దక్షిణం: 20 అడుగుల వెడల్పు గల రస్తా. ఈ దిశలకు లోగా
తూర్పు–పడమర: 24 అడుగులు లేక 7.315 మీటర్లు, ఉత్తరం– దక్షిణం : 62 1/2 అడుగులు లేక 19.050 మీటర్లు.

జి.పరమేశ్వర కుమార్
పి.రంగనాథ్
వాది/డి.హెచ్ఆర్ తరపు న్యాయవాది, ప్రొద్దుటూరు.

బంగారం పనిచేసే కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బంగారం పనిచేసే కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బంగారం పనిచేసే కార్మికులు ప్రొద్దుటూరులో దాదాపుగా 5000 మందికిపైగా ఉన్నారన్నారు. బంగారం ధరలు విపరీతంగా పెరగడం, పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ రావడం వల్ల ఆ కార్మికులకు పని లేకుండా పోయిందని తెలిపారు. వేలాది కుటుంబాలు పనిలేక అనేక ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. అప్పుల పాలవుతూ ప్రయివేట్ వడ్డీ వ్యాపారస్తుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చేనేత పనులు లేక బంగారు పనుల్లోకి వచ్చి పనులు చేసుకుంటున్నారని, ఇప్పుడు ఆ పనులు కూడా కోల్పోయారని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులో పనిచేసే కార్మికులకు, ఇల్లు లేని పేదలకు మున్సిపాలిటీలో రెండు సెంట్లు, రూరల్ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం ఏరియా కార్యదర్శి శేఖర్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

చరిత్రలో నిలిచేలా అల్లాడుపల్లె అభివృద్ధి

ప్రమాణం చేస్తున్న ఆలయ నూతన పాలకమండలి సభ్యులు

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానాన్ని అన్ని వసతులతో చరిత్రలో నిలిచేలా అభివృద్ధి చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నూతన పాలకమండలి సభ్యులను కోరారు. ఆ మేరకు చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్ కృషి చేయాలన్నారు. మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన నూతన పాలక మండలి సభ్యులు సోమవారం టిటిడి కల్యాణమండపంలో ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన వంతు సహకారం అన్నివేళలా ఉంటుందన్నారు. దేవస్థానం భూములు, స్థలాలు ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధికి సంబంధించిన నివేదికను సిద్ధం చేసి తనకు పంపాలన్నారు. చైర్మన్ వీరనారాయణ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన శక్తిమేర కృషి చేస్తానని పేర్కొన్నారు. స్నానపు గదులు, వేడి నీటి వసతి, అన్నదాన సత్రంకు శాశ్వత పరిష్కారం, ఆలయ ప్రాంగణంలో రోడ్డు వెంబడి విద్యుత్ దీపాల ఏర్పాటుకు ఎమ్మెల్యే సహకరించాలన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో ధర్మకర్త మండలి ఛైర్మన్, కమిటీ సభ్యులుగా ఆర్.వీరారెడ్డి, జిసి వీరారెడ్డి, బి.జగన్నాథరెడ్డి, వి.నరేంద్రశర్మ, ఓం మహేశ్వర్‌రెడ్డి, డి.పావని, కె.ఆదిలక్ష్మమ్మ, పి.పార్వతి, పి.చెన్నమ్మ, వి.గుర్రమ్మ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ డి.గురివిరెడ్డి, నీటిపారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు వేమారెడ్డి, వైవి సుబ్బారెడ్డి, మిల్లు శ్రీను, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, గుత్తి వీరనారాయణ యాదవ్, కిషోర్ యాదవ్, దొంతు సుబ్రహ్మణ్యం, నారపురెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి : బిటెక్ రవి

ప్రజాశక్తి - వేంపల్లె

వషభాచలేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి నూతన పాలక మండలి సభ్యులు ఐక్యంగా పనిచేయాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి సూచించారు. స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న శ్రీవీరాంజనీయ స్వామి ఆలయంలో సోమవారం వషభాచలేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి, టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ ఇఒ హనుమంత్ పాలక మండలి సభ్యులు పివి రమణ, మారుతి ప్రసన్న, రామయ్య, నాగిశెట్టి సునీల్ కుమార్, పెద్ద రామాంజనేయులు, తప్పెట వరాలు, దాసరి రవణమ్మ, జూటూరు జ్యోతి, కొమ్మెది వెంకట సుబ్బమ్మ, కొనేటి రాజమ్మ, హరిప్రవీణ్‌చే ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా చింతలమడుగుపల్లెకు చెందిన పాలేగాళ్ల వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సమావేశంలో బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. వేంపల్లెలో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బిజెపి నేత శశీభూషణ్‌రెడ్డి, సుష్మా, గాలి హరిప్రసాద్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, టిడిపి యవనేత రజనీకాంత్‌రెడ్డి, శివకృష్ణారెడ్డి, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, వీరబద్ర, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, వార్డు మెంబర్ కంతూరి వెంకటేష్, భాస్కర్, గండి మాజీ ఛైర్మన్ వెంకట రమణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు. కడప రోడ్డులో ఉన్న మాజీ వార్డు మెంబర్ నల్లగారి కృష్ణారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, కోడలు గాయత్రిని బిటెక్ రవి, రఘునాథ్‌రెడ్డి ఆశీర్వదించారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం పిలుపు మేరకు పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. వారితోపాటు పలువురు టిడిపి నాయకులను ఆర్యవైశ్య సంఘం తరుపున ఘనంగా సత్కరించారు.

ప్రయివేట్ ఫైనాన్స్ ఆగడాలను అరికట్టాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం మండలం వేపరాల గ్రామంలో ఎస్ బ్యాంక్ ప్రయివేట్ ఫైనాన్స్ వారి ఆగడాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ కోరారు. వేపరాల ఫైనాన్స్ బాధితులతో కలిసి ఆయన సోమవారం మైలవరం పోలీసు స్టేషన్‌లో అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ ఎస్ ప్రయివేట్ ఫైనాన్స్ వారు వేపరాల గ్రామంలో మహిళలను గ్రూప్‌గా చేర్చి వారికి డబ్బులు ఇచ్చి వారం కంతులులా వసూలు చేసుకొని వెళ్లేవారన్నారు. తీసుకున్న డబ్బులు కడుతుండేవారని, వర్షాల కారణంగా పనులు లేక కంతులు కట్టడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాయిదా రూపంలో కడతామని చెప్పినా, కొంత సమయం ఇవ్వమని అడిగినా అవేవీ పట్టించుకోకుండా బలవంతంగా బెదిరిస్తూ ఇంటి వద్దకు వచ్చి గందరగోళం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను ఒత్తిడి, బలవంతంగా చేయకుండా, బెదిరించకుండా సమయం ఇప్పించాలని కోరుతున్నామన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, శ్రీను, మోహన్, బాలచంద్రుడు, సంజీవ రాయుడు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మికుల సంఘం నాయకులు

మున్సిపల్ కార్మికులపై దాడులు తగవు

నిరసనలో మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మున్సిపల్ కార్మికులపై దాడులు తగవని గౌరవ అధ్యక్షులు దాసరి విజయ్ తెలిపారు. అనంతపురం, గుంటూరులో పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులపై జరిగిన సంఘటనలను నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జమ్మలమడుగు పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద కార్మికులు నిరసన చేశారు. ఈ సందర్భంగా దాసరి విజయ్ మాట్లాడుతూ అనంతపురంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం వాటర్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న గౌరీ శంకర్‌పై లేనిపోని నిందలు మోపి అతని విధుల నుండి తొలగించాలని కుట్ర చేస్తున్న ఆ సంస్థ అధికారులు ఈ కుట్రకు ప్రధాన కారణమన్నారు. సమస్యలను నిరంతరం నిరసనల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడమే అతను చేస్తున్న పెద్ద నేరంగా అధికారులు భావిస్తున్నారని ఆగ్రహించారు. అధికారులకు, నాయకులకు సలాం కొడుతూ గులాంగిరి చేసే వారిలా ఉండాలని అధికారులు భావిస్తే మీ ఉద్యోగాలు ఊడిపోయే వరకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఇతర కార్మికులను కలుపుకొని నిరసనలు చేపట్టక తప్పదని హెచ్చరించారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికురాలు పద్మపై జనసేన వార్డ్ కౌన్సిలర్ దాడి చేయడమే కాకుండా మితిమీరిన పదాలతో అసభ్యకరమైన పదజాలంతో దుర్భాషలాడిన ఆ కౌన్సిలర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. అతనిపై సంబంధిత సెక్షన్లు పెట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు బి.నాగన్న, కార్యదర్శి ఎస్.శేఖర్, సహాయ కార్యదర్శి మైకెల్ బాబు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు సూచిస్తున్న జడ్‌పి సిఇఒ ఓబులమ్మ

తడి, పొడిచెత్తను వేరుచేయండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా ఉంచడం ద్వారా పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణ అనుకూలంగా ఉంటుందని జిల్లా పరిషత్ సిఇఒ ఓబులమ్మ, డిఎల్‌డిఒ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని సున్నపురాళ్లపల్లె గ్రామంలో సోమవారం అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటి వద్దకు వెళ్లి స్థానిక ప్రజలకు చెత్త గురించి వివరించారు. చెత్తతో ఎరువుల తయారీ, వాడకాన్ని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ కవర్లను వాడరాదని సూచించారు. మొక్కలు నాటి వాటిని పెంచాలని స్థానికులకు సూచించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు వద్ద శుభ్రత పాటించాలన్నారు. తాగునీటి పైపు లైన్లు లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, స్వచ్ఛ రథం ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో వెంకటరమణయ్య, పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయంలోనే పింఛను

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయం మేరకు అక్టోబర్ 1న పింఛన్ పంపిణీ సచివాలయంలోనే చేస్తామని జమ్మలమడుగు గ్రామ వార్డు సచివాలయ జెఎసి కమిటీ అధ్యక్షులు ఎంసి రాజకుల్లాయిరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం రాని వారికి మాత్రమే వారి ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తామన్నారు. జెఎసి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయానికి వచ్చా మన్నారు. 9 నెలల అరియర్ మంజూరు చేయాలన్నారు. ఆరేళ్ల ఎఎఎస్ స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు, జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ క్యాడర్ అప్గ్రేడ్ చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తగిన న్యాయం చేయాలన్నారు. పండుగలు, ఆదివారాలు, సెలవు రోజుల్లో అత్యవసర సమయం, విపత్తులు సంభవించిన సమయంలో తప్ప హాజరు కావలసిన అవసరం లేదని, అందుకు సంబందించిన సర్క్యులర్ విడుదల చేయాలన్నారు. భవిష్యత్తులో చేపట్టే బదిలీల్లో ఎలాంటి పైరవీలకు, అవకతవకలకు తావు లేకుండా ఉపాధ్యాయ బదిలీల మాదిరిగా ప్రత్యేక పాలసీతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సీనియారిటీ లిస్టులు విడుదల చేసి, దివ్యాంగ ఉద్యోగులకు క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ విధుల నుండి విముక్తి కల్పించేలా సచివాలయాల శాఖ ద్వారా మరోసారి ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్‌లను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు గ్రామ వార్డు సచివాలయ జెఎసి కమిటీ కార్యదర్శి బిర్రు చంద్ర శేఖర్, కార్యవర్గ సభ్యులు చిన్న వెంకటేష్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

దోమకాటు.. ఆరోగ్యానికి చేటు

- జిల్లా మలేరియా అధికారి మనోరమ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమకాటు ఆరోగ్యానికి చేటు అని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. స్థానిక బ్రాహ్మణపల్లె రోడ్డులో జరుగుతున్న ఫీవర్ సర్వే, లార్వా సర్వే కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలను అడిగి ప్రజల్లో జ్వరాలు ఉన్నాయా అనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మనోరమ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో, పరిసరాల్లో శుభ్రత పాటించాలన్నారు. నీటి నిల్వాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. దోమల వృద్ధిని నివారించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అన్నారు. ప్రతి శుక్రవారం డ్రయిడే పాటించాలని సూచించారు. రాత్రి సమయంలో దోమ తెరాలు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖజా మొద్దీన్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య కార్యకర్తలు శేషగిరి నాయక్, సౌభాగ్య, ప్రశాంతి, ఆశా కార్యకర్త మహాలక్ష్మి పాల్గొన్నారు.

వెలుగుతున్న విద్యుద్దీపాలు, తొలగిస్తున్న కంపచెట్లు

ఎల్ఎమ్ కాంపొండ్‌లో వెలిగిన విద్యుద్దీపాలు

తొలగిన కంపచెట్లు, మొక్కలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలోని ఎల్ఎమ్ కాంపౌండ్‌లో విద్యుద్దీపాలు వెలిగాయి. పిచ్చి మొక్కలు, కంపచెట్లు తొలిగాయి. ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం 'ఎల్ఎమ్ కాంపౌండ్‌లో వెలగని విద్యుద్దీపాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం పంచాయతీ సిబ్బంది విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రహరీ పక్కన, రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చి మొక్కలు జెసిబి యంత్రంతో తొలగించారు. కాలనీ వాసులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

దోమల నివారణ, ఫాగింగ్ చేయించాలని వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దోమల నివారణ, ఫాగింగ్ చేయించాలని డివైఎఫ్ఐ నాయకులు సోమవారం గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రమిచ్చారు. గోపవరం పంచాయతీ పరిధిలో దోమలు ఎక్కువగా ఉన్నాయని, కాలువల్లో పూడికతీత సరిగా లేదన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. చాలా రోజుల నుంచి కాలువలో పూడిక తీయకపోవడంతో చెత్త పేరుకుపోయి దారుణంగా ఉందన్నారు. కాలువలో దోమల నియంత్రణకు మందు పిచికారి చేయాలన్నారు. గ్రామంలో చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

పిఎస్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులు

సంస్కరణలు మహిళా సాధికారికతకు భరోసా

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం నిత్యవసర సరుకులు, సామగ్రి ధరలను తగ్గించడంతో మహిళలు ఆర్థికంగా రాణించేందుకు తోడ్పాటు ఉంటుందని డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి జిఎస్‌టి తగ్గుదలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల నిత్యవసర సరుకులు, గృహ ఉపకరణాలు, స్కూటర్లు, కార్లపై జిఎస్‌టి చాలావరకు తగ్గించారన్నారు. తద్వారా ఆర్థిక భారం తగ్గిందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిఎస్‌టి తగ్గుదలపై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఒ రామానుజం, వెలుగు ఎపిఎం శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాసవి మాత బిందెసేవ

ప్రజాశక్తి - వేంపల్లె

దసరా ఉత్సవాల సందర్భంగా సోమవారం వాసవి మాత బిందెసేవను ఆర్యవైశ్య సంఘం ఘనంగా నిర్వహించింది. వేంపల్లె పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. పలు వేషధారణలు, నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో వాసవి మాత ఉత్సవమూర్తికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, యవజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు తెలిపారు. **ఐటిఐలో ఆయుధపూజ..** స్థానిక కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటిఐలో దసరా సందర్భంగా సోమవారం ఆయుధపూజ నిర్వహించారు. అన్ని ట్రేడ్‌ల్లోని తరగతి గదుల్లో ఉన్న ఇనుప వస్తువులు, ఇంజిన్లకు కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరావు పూజ చేశారు. అనంతరం ఆయుధపూజ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఐటిఐ అధ్యాపకులు అమర్నాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్ నాయుడు, ఉత్తమారెడ్డి, వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రికార్డ్ అసిస్టెంట్ జి.మనోహర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడుగా జె.లక్షుమయ్య, ఉపాధ్యక్షులుగా ఆర్.రామకృష్ణ, ఇ.చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.రామమోహన్, కోశాధికారిగా పి.ఓబన్న, సభ్యులుగా రాజా, ఎన్.రామిరెడ్డి, బిపి సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్ జి.సుబ్బమ్మ

పౌష్టికాహారం ఆరోగ్యానికి శ్రేయస్కరం

ప్రజాశక్తి - ఖాజీపేట

పౌష్టికాహారం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని బి.కొత్తపల్లె సర్పంచ్ గంగిరెడ్డి సుబ్బమ్మ సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు పౌష్టికాహారం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తప్పక తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు, వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం మిడుతూరు ప్రభుత్వ వైద్యురాలు మాధవి మాట్లాడుతూ అనుభవం ఉన్న వైద్యులచే నిర్వహిస్తున్న వైద్య సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పెంచల్‌రెడ్డి, స్థానిక వైసిపి రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు నాగిరెడ్డి పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎఇ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేజర్ గ్రామ పంచాయతీలోని యానాది కాలనీలో సోమవారం రూరల్ డెవలప్‌మెంట్ సప్లయ్ పథకం (ఆర్‌డిఎస్) కింద ఎఇ ఆధ్వర్యంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు 24 గంటలపాటు పనిచేసే కొత్త 25 కెవిఎ డిటిఆర్ ఫీడర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలో మొదటిసారిగా ఆర్‌డిఎస్ పథకంలో భాగంగా ఎజిఎల్ ఫీడర్ 1ఫేజ్ సరఫరా చేసే స్థానంలో యానాది కాలనీలో 3ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్ యోగానంద రెడ్డి, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.